
ఆర్డీఎస్ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం

ఉండవల్లి, ఆగస్టు 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల శివారులోని జూరాల లింక్ ఆర్డీఎస్ కెనాల్‌లో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై శ్రీనివాసులునాయక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం వీకేర్ సమీపంలో బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి కాలువలో శవం ఉన్నట్లు గుర్తించి వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న ఉండవల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని వెలికితీశారు. మృతుని వయస్సు సుమారు 50 నుంచి 55లోపు ఉంటుందన్నారు. మృతుడి ఒంటిపై నీలిరంగు గీతల పంచ ఉంది. మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆశల పల్లకిలో..

- ఈసారి మంత్రివర్గ విస్తరణలో వాకిటి శ్రీహరికి బెర్త్ దక్కేనా?
- విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ కోసం ఢిల్లీకి సీఎం రేవంత్
- పీసీసీ, మహిళా అధ్యక్ష పదవుల రేసులోనూ పాలమూరువాసులు
- ఈసారి బీసీలకు ఇవ్వాలంటున్న నేతలు
- విప్ కోసం యెన్నం, ఆర్టీసీ చైర్మన్ పదవి కోసం వంశీకృష్ణ యత్నం
- రాచాల యుగంధర్, ఎంఎస్ఆర్, తిమ్మప్ప, చంద్రశేఖర్‌రెడ్డి పేర్లు
- వాటితోపాటు జిల్లాల్లో స్థానిక నామినేటెడ్ పోస్టుల కోసం కూడా..



మహబూబ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతేడాది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్దిమంది మంత్రులతో ప్రభుత్వం కొలువు దీరింది. ఉమ్మడి జిల్లా నుంచి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగా.. జూపల్లి కృష్ణారావు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇంకా పలు కేబినెట్ బెర్తులు ఖాళీగా ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆ ఖాళీలను భర్తీచేస్తారని ఆశించగా.. సీఎం రేవంత్‌రెడ్డి రెండుసార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు. అయినప్పటికీ.. మంత్రివర్గ విస్తరణకు మోక్షం లభించలేదు. దీంతోపాటు కీలకమైన పీసీసీ, దాని అనుబంధ పోస్టులు, జిల్లా కార్యవర్గాల నియామకం కూడా చేపట్టాల్సి ఉంది. మొదట పీసీసీ పూర్తయితేనే అందుకు మార్గం సుగమం అవుతుంది. పంచాయతీలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు ముహూర్తాలు ఖరారు కానున్న వేళ.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతంగా నిలపడం చాలా అవసరం.. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడంతో మంత్రివర్గ విస్తరణతోపాటు పీసీసీ అధ్యక్షుడి నియామకం, రాష్ట్ర, జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూలు పార్లమెంట్‌కు ప్రస్తుతం జూపల్లి కృష్ణారావుకు మంత్రివర్గంలో చోటు దక్కగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో మరో బెర్తు ఖరారు కావాల్సి ఉంది. ఈ నియోజకవర్గ పరిధిలో ఒక్క యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మినహా మిగతా అందరూ మొదటి సారి గెలిచిన వారే ఉన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అందరూ పనిచేసుకుంటూ వెళ్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనల సందర్భంగా వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తే.. ముదిరాజు బిడ్డను పంద్రాగస్టు లోపు మంత్రిగా చేస్తాను అని ప్రకటించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో బీసీల నుంచి గెలిచిన ముదిరాజు ఒకే ఒక్కరు ఉండగా.. ఆయనే మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ అని చెప్పవచ్చు. దీంతో అందరూ శ్రీహరికి మంత్రి పదవి ఖాయమేననే అభిప్రాయంలో ఉన్నారు. ప్రస్తుత ఫైల్‌లో కూడా వాకిటి శ్రీహరి, సుదర్శన్‌రెడ్డి పేర్లు ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ పార్టీ కరుడు కట్టిన కార్యకర్తగా పేరుంది. అంచెలంచెలుగా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన ఆయనకు మాస్ లీడర్‌గా గుర్తింపు కూడా ఉంది. ప్రస్తుత కేబినెట్‌లో 11 మంది ఉండగా.. మరో ఏడుగురిని కేబినెట్‌లోకి చేర్చు కోవచ్చు. కోర్టు తీర్పుతో ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించగా.. ఆయనకు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే ఈ విడ తలోనే కోదండరాం, వాకిటి శ్రీహరి, సుదర్శన్‌రెడ్డి, మరోకరి అవకాశం లభిస్తుందని తెలుస్తోంది. అలాగే అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆర్టీసీ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. రెండుసార్లు అచ్చంపేట నుంచి ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ విప్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే విప్‌లను నియమించగా, అందులో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న నేపథ్యంలో ఆయన ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలిసింది.

పీసీసీ, మహిళా కాంగ్రెస్‌పైనా..

ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.. వచ్చే వరుస ఎన్నికల నేపథ్యంలో పీసీసీ బాధ్యతలను మరొకరికి అప్పగించాల్సిన అవసరం ఉంది. ఈ పోస్టు కోసం ముగ్గురి పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా.. అందులో ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అలంపూర్ నియోజకవర్గానికి చెందినవారు.. ఈ పోస్టు కోసమే.. ఆయన వేరే పదవులు కూడా తీసుకోలేదు. మంచి వాగ్దాటి ఉండటం, సామాజికవర్గపరంగా కూడా దళితులకు పీసీసీ ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉండటంతో సంపత్ బలమైన ప్రయత్నాలు చేస్తున్నారు. నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించిన సమయంలోనే తనకు టిక్కెట్ ఇవ్వకపోతే.. పీసీసీ ఇవ్వాలని సంపత్ కోరినట్లు కూడా చర్చ జరిగింది. మరీ ఈ పర్యటనలో పీసీసీ ఖరారైతే.. సంపత్‌కుమార్‌కు ఆ అవకాశం దక్కుతుందో లేదా వేచిచూడాలి. అలాగే గద్వాల జడ్పీచైర్‌పర్సన్‌గా పనిచేసి.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గద్వాల అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందిన సరిత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొన్నటివరకు జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఉండటంతో ప్రొటోకాల్ ఉండగా.. ప్రస్తుతం ఆమె మాజీ అయ్యారు. అదే సమయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తన కేడర్‌ను కాపాడుకోవడంతోపాటు పార్టీలో పట్టు సాధించడం, వచ్చే ఎన్నికల వరకు ఎదురొడ్డి నిలిచే శక్తి కావాలనే ఆలోచన ఉండటంతో ఆ ప్రయత్నాలు కూడా ముమ్మరంగానే సాగుతున్నాయి. స్థానిక రగడ నేపథ్యంలో ఆమెకు పార్టీ పదవి వస్తుందా? లేక ఏదైనా నామినేటెడ్ పోస్టు వస్తుందా? అనే విషయంలో మాత్రం సందిగ్ధత నెలకొంది. పార్టీలో ఆమె పెత్తనం, ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెత్తనం ఉండే విధంగా సమన్వయం జరుగుతుందా? అనేది అనుమానమే..

నామినేటెడ్‌పై కన్ను..

ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి... ఒక విడత నామినేటెడ్ భర్తీని పూర్తిచేశారు. ఇంకా కొన్ని కార్పొరేషన్లు, కమిషన్లు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు పోస్టులు ఆశిస్తు న్నారు. గతం భర్తీలో ఉమ్మడి జిల్లా నుంచి బీసీలకు నామినేటెడ్ పోస్టులు కేటాయించ లేదని, ఈసారి ఎక్కువ కేటాయించాలనే డిమాండ్ ఆయా కులసంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. దేవరకద్ర నియోజకవర్గం నుంచి బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నేత రాచాల యుగంధర్‌గౌడ్ పోస్టు ఆశిస్తున్నారు. ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ లేదా బీసీ కమిషన్ మెంబర్ కోసం ప్రయత్నిస్తున్నారు. అలాగే గద్వాలకు చెందిన గట్టు తిమ్మప్ప మళ్లీ తనకు వినియోగదారుల కార్పొరేషన్ చైర్మన్‌ను అడుగుతున్నారు. అదే జిల్లాకు చెందిన బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి తనకూ నామినేటెడ్ పోస్టు ఆశిస్తున్నారు. వీరితోపాటు జిల్లా స్థాయి పోస్టులు ఆశించే వారు కూడా ఉన్నారు. మహబూబ్‌నగర్ నుంచి మారేపల్లి సురేందర్‌రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, బురుజు సుధాకర్‌రెడ్డి, ఎన్పీ వెంకటేష్, సంజీవ్ ముదిరాజ్, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్ ఖాద్రీ, అమరేందర్‌రాజు, వసంత, జడ్చర్ల నుంచి బీ వెంకటేశం, బాద్మి రవిశంకర్, నిత్యానందం, నారాయణపేట నుంచి సంగంబండకు చెందిన గవినోళ్ల బాలకృష్ణారెడ్డికి అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది. అలాగే మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి మహిళలకు సంబంధించిన కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. నారాయణపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి వేణుగోపాల్, ఎండీగౌస్ జిల్లాస్థాయి పోస్టులను ఆశిస్తున్నారు. నాగర్‌కర్నూలు జిల్లా నుంచి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన బాలాజీసింగ్ నామినేటెడ్ పోస్టు ఆశిస్తున్నారు. సురభి వెంకటేశ్వర్‌రావు, బిజినేపల్లి మండలం నుంచి సుహాసినీరెడ్డి కూడా నామినేటెడ్ రేసులో ఉన్నారు. వనపర్తి నుంచి పీసీసీ డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, గద్వాల నుంచి శ్రీనివాసులు ఉన్నారు. ప్రధానంగా ముడా, గ్రంథాలయ సంస్థలు, మార్కెట్, ఆలయ కమిటీలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతల కోసం పోటీ పడుతున్నారు.

జిల్లా అభివృద్ధిలో.. భాగస్వాములు కావాలి

- ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 16: జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా పంట రుణాలు అందజేయాలని కోరారు. శుక్రవారం వనపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 తరువాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి లభ్యత పెరిగి వ్యవసాయంతో పాటు రైతుల ఆర్థిక స్థోమత పెరిగిందన్నారు. రైతుల రుణమాఫీ జరిగి బ్యాంకుల రుణాలు అన్ని తిరిగి జమ అయ్యాయని, అందువల్ల అదేస్థాయిలో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. రైతు రుణమాఫీ ద్వారా వనపర్తి జిల్లాలో దాదాపు రూ.400 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని, వ్యవసాయ రుణాలు మాత్రం 10 శాతం దాటలేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,454.92 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకోగా జూన్, 2024 వరకు కేవలం రూ.324.92 కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఎంఎస్ఎంఈ ప్రయారిటీ సెక్టార్లు అయిన విద్యా, గృహ నిర్మాణం తదితర రంగాల్లో రూ.3961 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇచ్చింది మాత్రం రూ.386.28 కోట్లు మాత్రమే అన్నారు. కొన్ని బ్యాంకుల వద్ద రుణమాఫీ జరిగిన తరువాత తిరిగి రుణాలు అడిగితే అభ్యంతరాలు చెబుతున్నారని. అసైన్డ్ ల్యాండ్, లవాణి పట్టా భూములకు రుణాలు ఇవ్వడం లేదని రైతులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి : మంత్రి జూపల్లి

పాన్‌గల్ : డీ-8 కాలువ ద్వారా రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్, గోప్లాపూర్ సమీపంలోని కేఎల్ఐ డీ-8 కాలువను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలో జమ్ము పూడికను తొలగించి సాఫీగా సాగునీరు పారే విధంగా చూడాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వడదెబ్బతో రైతు మృతి

మానవపాడు, ఆగస్టు 16 : వడదెబ్బతో రైతు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దిలేటి(55) గురువారం భార్య లలితమ్మ, కుమారుడితో కలిసి పంట పొలానికి వెళ్లాడు. పొలంలో పనులు చేస్తుండగా మధ్యాహ్నం తర్వాత కుప్పకూలి పడిపోయాడు. వెంటనే భార్య, కుమారుడు ఓ చెట్టు కిందకు తీసుకువెళ్లి గ్రామంలోని వ్యక్తులకు సమాచారం ఇచ్చి ఆటోలో మానవపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భార్య లలితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

జడ్చర్లలో భారీ వర్షం

- సుమారు 57 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

జడ్చర్ల/ మిడ్జిల్ ఆగస్టు 16 : జడ్చర్లలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఏకధాటిగా కురవడంతో 57మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కురిసిన వర్షంతో పట్టణంలోని పలు కాలనీలలోకి నీళ్లు వచ్చాయి. పట్టణంలోని నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డ వెళ్లే దారిలోని వెంకటరమణ టాకీస్ సమీపంలో ప్రధానరహదారిపై సుమారు రెండు ఫీట్ల మేర నీరు నిలిచింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది నెలకొంది. దుకాణాల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు సగానికిపైగా నీళ్లలో మునిగిపోయాయి. ప్రధానరహదారిపై సుమారు వంద మీటర్ల మేర నీళ్లు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రైనేజీలు నిండుకోవడంతో రోడ్డుపై నీళ్లు నిలిచిపోతున్నాయని, నీళ్లు వెళ్లేలా మురుగుకాలువ నిర్మాణం చేపట్టాల్సిన అవశ్యకతను గుర్తించాలని కోరారు. ఈ రహదారితో పాటు సిగ్నల్‌గడ్డలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా వెళ్లే దారిలో చైతన్యనగర్ ప్రాంతంలో రోడ్డుపై వర్షం నీళ్లు నిలిచిపోయాయి. పట్టణంలోని చైతన్యనగర్ కాలనీతో పాటు 16వ వార్డులోని పెద్దమోరీ సమీపంలో ఉన్న కాలనీలోని ఇళ్లల్లోకి వర్షం నీరు చేరడంతో ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందుల కు గురయ్యారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని పలు కాలనీలలోని ఇళ్లల్లోకి నీళ్లు రావడంతో ఇబ్బందులకు గురయ్యారు.

మిడ్జిల్ మండలంలోని మున్ననూర్, రాణిపేట, కొత్తపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు సక్రమంగా కురువకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం ఆనందం కలిగించిందని పలు గ్రామాల రైతులు తెలిపారు.



జడ్చర్ల పట్టణంలో ప్రధాన రహదారిపై వర్షం నీటిలో వెళ్తున్న కారు, నీట మునిగిన ద్విచక్రవాహనాలు



నారు ముదురుతోంది..

- వరి నాట్లు వేయడానికి కూలీల కొరత
- అనుకూల వర్షాలతో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఒకే సారి అన్ని పనులతో దొరకని కూలీలు
- రెండింతలు పెరిగిన కూలి రేట్లు


కేటీదొడ్డిలో గొర్రు కొడుతున్న రైతు


నారుమడిలో నారు తీస్తున్న కూలీలు


కేటీదొడ్డిలో వరినాటు వేస్తున్న కూలీలు

కేటీదొడ్డి, ఆగస్టు 16: జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో వరి నాట్లు వేయడానికి కూలీల కొరత నెలకొంది. ఈ ఏడాది వర్షాకాలం మొదలైనప్పటి నుంచి వానలు పంటలకు అనుకూలంగా కురుస్తుండడంతో రైతులు వివిధ రకాల పంటలు సాగు సాగు చేస్తున్నారు. ఇప్పటికే పత్తి, మిరప సాగు చేయగా, ఇప్పుడు వరి నాట్లేస్తున్నారు. చాలా గ్రామాల్లో నాట్లు వేయగా, కొన్ని గ్రామాల్లో వేయాల్సి ఉంది. పొలాల్లో కలుపు తీయడం, పత్తి పొలాల్లో క్రాసింగ్ చేయడం వంటి పనులకు వెళ్తుండటంతో వరి నాటు వేసేందుకు కూలీలు దొరకడం లేదు. కూలీల కొరతతో వరి నారు ముదిరిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది కంటే ఎక్కువ సాగు

మండలంలో గత ఏడాది 13 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో గతేడాది కంటే ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. వరినాట్లు వేయడానికి ముందు గ్రామాల్లో కూలీలకు మహిళలకు రోజుకు రూ.200, పురుషులకు రూ.300 ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం వరి నాటేందుకు కూలీల కొరత నెలకొడంతో కూలీ రేట్లు రెండింతలు పెంచేశారు. ప్రస్తుతం మహిళలకు రూ.400 నుంచి రూ.500, పురుషులకు రూ.600 నుంచి 700 వరకు ఇస్తున్నారు. అయినా కూడా కూలీలు దొరకడం లేదని రైతులు అంటున్నారు.

కూలీలు దొరకడం లేదు



వరి నాట్లు వేసేందుకు, నారు మళ్లలో కలుపు తీసేందుకు మహిళలకు రూ.500 కూలీ ఇస్తామన్నా దొరకడం లేదు. ఇప్పటికే పంట పెట్టుబడి చాలా ఎక్కువ అయ్యింది. దీంతో పాటు కూలీల రేట్లు కూడా రెండింతలు పెంచారు. ఇది ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేసేవారి సంఖ్య తగ్గిపోతుంది.

- వీరేష్, రైతు, కేటీదొడ్డి

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

గద్వాల క్రైం, ఆగస్టు 16 : ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన యువకుడిని అరెస్టు చేశారు. పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని కొత్తహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎండీ ఇర్ఫాన్ అనే యువకుడు పట్టణంలోని బీరెల్లి రోడ్ సమీపంలో ఉన్న నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశారు. గతంలో కూడా కొందరికి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఇర్ఫాన్ మోసం చేసినట్లు గద్వాల జిల్లాలోని ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులను పరిగణలోకి తీసుకొని గురువారం రాత్రి ఇర్ఫాన్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు అడిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

- 18 తులాల బంగారం రికవరీ

వెల్దండ, ఆగస్టు 16; ఇటీవల వెల్దండతో పాటు వివిధ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని కొట్ర చౌరస్తా వద్ద ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన అల్లం శివ అనే వ్యక్తి వద్ద కొంత బంగారం దొరికింది. దీంతో పోలీసులు అతన్ని విచారించగా మండలంలోని పెద్దాపూర్, కుప్పగండ్ల, ఊర్కొండ మండలం రేవల్లి, కల్వకుర్తి మండలం యంగంపల్లి, మిడ్జిల్ మండలం వాడ్యాల గ్రామాల్లో 18 తులాల బంగారాన్ని దొంగిలించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు శివ నుంచి బంగారాన్ని రికవరీ చేసి అరెస్టు చేసి అతన్ని కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తిని ఎస్పీ రఘునాథ్ అభినందించారు.


పట్టుబడ్డ నిందితుడితో పోలీసులు

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

చారకొండ, ఆగస్టు 16: నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చారకొండ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. కేసుల రికార్డులను, భూవివాదంపై నమోదైన కేసులపై డీఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఈనెల 14న జాతీయ రహదారి నుంచి నరసింహులు అనే వ్యక్తి సైకిల్‌పై గ్రామంలోకి వెళ్తుండగా ఎదురుగా బైక్ ఢీకొనడంతో నరసింహులు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం బాధితుడి కుమారుడు రఘుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన పంచలింగాలకు చెందిన సలాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి పొంగులేటిని కలిసిన జీఎంఆర్

- కౌకుంట్లకు సౌకర్యాలు కల్పించాలని వినతి



మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట, దేవరకద్ర, ఆగస్టు 16 : కొత్తగా ఏర్పడిన కౌకుంట్ల మండల కేంద్రానికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డితో పాటుగా టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్ రెడ్డి తదితరులు కలిశారు. కేవలం కౌకుంట్ల మండలం కాగితాలకే పరిమితమైందని, మండల కేంద్రంలో ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కాలేదని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ నోటిఫై చేయక పోవటంతో తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులకు గత ఏడాదికాలంగా జీతాలు రావటం లేదని తెలిపారు. పై సమస్యలను సత్వరం పరిష్కరిచేలా చూడాలని ఎమ్మెల్యే మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో వివరించినట్లు తెలిపారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి టౌన్,ఆగస్టు16: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పాండు సాగర్‌ను భారీ మెజార్టీతో గెలిపించు కుందామని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణానికి వచ్చిన ఆయన తన స్వగృహంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో జిల్లా తరఫున పాండు సాగర్‌ను ప్రతిపాదించి వచ్చిన నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పీసీసీ డెలిగేట్ శంకర్ ప్రసాద్, తిరుపతయ్య, శ్రీనివాస్ గౌడ్, సురేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బావిలో పడి నాలుగో తరగతి విద్యార్థిని మృతి

- తారాపురంలో విషాదం


మౌనిక (ఫైల్)

గట్టు, ఆగస్టు 16 : ఆటలాడుకుంటూ బావి వద్దకు వెళ్లిన బాలిక అందులో పడి మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తారాపురం గ్రామంలో చోటు చేసుకున్నది. ఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సరోజ, ఆంజనేయులు దంపతుల కుమార్తె మౌనిక(8) అదే గ్రామంలో నాల్గవ తరగతి చదువుతోంది. గురువారం తోటి పిల్లలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం తల్లిదండ్రులతో పాటు, తోటి పిల్లలతో కలసి పొలానికి వెళ్లింది. ఆటలాడుకుంటూ సమీపంలోని బావి వద్దకు వెళ్లింది. అదుపు తప్పి బావిలో పడిపోయింది. కుమార్తె బావిలో పడ్డ విషయం గమనించని తల్లిదండ్రులు కొంతసేపటి తర్వాత ఆమె కోసం ఆరా తీశారు. అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూశారు. అప్పటికే బాలిక నీటిలో పడి మృతి చెందింది. దీంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. బాలిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతదేహం తీసుకెళ్లేందుకు నిరాకరణ

వడ్డేపల్లి, ఆగస్టు 16 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామానికి చెందిన వడ్ల సత్యమ్మ(36) రెండురోజుల క్రితం ఉరివేసుకొని మృతి చెందింది. గురువారం మృతురాలి పిల్లలు హాస్టల్ నుంచి ఇంటికి రాగాతల్లి ఉరివేసుకున్నది చూసి షాక్‌కు గురయ్యారు. మృతురాలి తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వారు గ్రామానికి వచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అలంపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శుక్రవారం ఉదయం మృతురాలి కూతురు భార్గవి తనతల్లి అనారోగ్య పరిస్థితుల వల్లనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేసింది. దీంతో తాము అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేస్తే కూతురు ఇచ్చిన ఫిర్యాదుపై ఎలా కేసు మారుస్తారంటూ పోలీసులతో మృతురాలి తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. తాము మృతదేహం తీసుకెళ్లేది లేదని నిరాకరించడంతో పోలీసులు చేసేది లేక ఆసుపత్రి మార్చురీలోనే మృతదేహాన్ని ఉంచారు. ఎస్సై సంతోష్‌ను వివరణ కోరగా మృతురాలి తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారని, కూతురు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేశామని తెలిపారు.

తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

- తక్షణమే నీటి వృథాను ఆపాలని కోరిన విజయుడు
- కర్ణాటక మంత్రి, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి వెళ్లిన ప్రజాప్రతినిధి
- 34 టీఎంసీలు దిగువకు వెళ్లాయన్న అధికారులు


19వ గేట్ మరమ్మతు పనులు చేస్తున్న ఇంజనీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 16 : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల నిమిత్తం 1953లో ఏర్పాటైన తుంగభద్ర డ్యాంకు అమర్చిన 33 గేట్లలో ఇటీవల 19వ గేటు వరద ఉధృతికి కొట్టుకుపోయిన సంఘటన తెలిసిందే. దీంతో అక్కడి ప్రభుత్వం ప్రమాద హెచ్చరికలు జారీ చేసి, మరమ్మతులకు ఆదేశించింది. మరమ్మతు పనులను శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కర్ణాటక మంత్రి జామీర్‌అహ్మద్, కంప్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్. గణేష్‌లతో కలిసి వెళ్లి సందర్శించారు. మరమ్మతుల వివరాలను ప్రాజెక్టు ఎస్ఈఈ శ్రీకాంత్‌రెడ్డి, డీఈఈ జ్ఞానేశ్వర్‌లతో అడిగి తెలుసుకున్నారు. నీరు వృథాగా పోవడం వల్ల ఆర్డీఎస్ రైతాంగం ఇబ్బంది పడే అవకాశం ఉందని, నీటి వృథాను వెంటనే నిలువరించాలని ఎమ్మెల్యే విజయుడు కోరారు. అయిదు ఎలిమెంట్ల ద్వారా వృథాగా పోయే నీటిని ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే మూడు ఎలిమెంట్లు అమర్చామని వివరించారు. 34 టీఎంసీల నీరు వృథాగా దిగువకు పోయిందని, ప్రస్తుతం నీటిమట్టం 71 టీఎంసీలు ఉన్నట్లు అక్కడి అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 27వేల క్యూసెక్కులు కాగా ఔట్‌ఫ్లో 65వేల క్యూసెక్కులుగా కొనసాగుతోందన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే వెంట వావిలాల రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గజేంద్రరెడ్డి, సంకాపురం రాముడు, అమరవాయి రవి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, కొంకల శేఖర్‌రెడ్డి, రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, సత్యన్న, భీమేష్‌గౌడు, తిప్పన్న ఉన్నారు.

అట్టడుగు ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందలేదు

- మతోన్మాదుల చెరనుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు

పాలమూరు, ఆగస్టు 16 : స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు ప్రజలకు నేటికీ అందలేదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదుల చెరనుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో '78ఏళ్ల స్వాతంత్ర్యం రాజ్యాంగ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉం.మాణిక్యంరాజు అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడి దారులకు పాలకవర్గాలు ఎర్రతివాచీ పరిచి అట్టడుగు ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య ఫలాల సంరక్షణ కోసం దేశంలో ధర్మయుద్ధం చేయడానికి యువతరం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం 111వ స్థానానికి చేరిందన్నారు. 40కోట్లకు నిరుద్యోగ సైన్యం పెరిగిందని, 46కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారని చెప్పారు. మరోవైపు 169 మంది శతకోటీశ్వరులు ఎదిగి ఆదాని ప్రపంచంలో నెంబర్2 కుబేరుడుగా ఆయ్యాడని తెలిపారు. 40శాతం మంది ప్రజల ఆస్తి ఒక్కశాతం చేతుల్లో మగ్గుతోందన్నారు. ఈ ఆర్థిక అంతరాలు పెరుగుతున్న తీరు దేశాన్ని మరింత దిగజార్చేవైపు నడిపిస్తోందన్నారు. దళితులు, మహిళలు, మైనారిటీలపై దాడులు బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో 300శాతం పెరిగాయన్నారు. యువతరం మతోన్మాదుల దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సెమినార్‌లో యం.కుర్మయ్య ఆది విష్ణు, సంకర రాములు, క్రాంతి, కురుమూర్తి, ప్రవీణ్ పాల్గొన్నారు.

గుర్తింపులేని వాహనాలకు వేలం

- పోలీస్‌శాఖ పరిధిలో సీజ్‌చేసిన వాహనాలు తీసుకెళ్లాలని విన్నపం
- లేదంటే 30న వేలంపాట


సీజ్ చేసిన వాహనాలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 16 : పోలీసు తనఖీలో పట్టుబడ్డ వాహనాలు, దొరికిన వాహనాలను సీజ్ చేశామని, వాటిని ఎవరూ తీసుకెళ్లనందున వాటికి బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా ఎస్పీ జానకి తెలిపారు. ఇప్పటివరకు పోలీసుల ఆధీనంలో 76 వాహనాలున్నాయని తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన వివరాలను ఫేస్‌బుక్, ట్విటర్, సామాజిక మాధ్యమాలలో ఉంచడం జరిగిందన్నారు. ఇందులో ఫోర్‌వీలర్ 1, త్రీవీలర్ 10, ద్విచక్ర వాహనాలు 65 ఉన్నాయని పేర్కొన్నారు. జడ్చర్ల డీటీసీలో ఇట్టి వాహనాలున్నాయని, వాహనదారులు ఆర్‌సీ తీసుకుని వస్తే ఈ వాహనాల ఇంజన్, చాసిస్ నెంబర్‌ల ఆధారంగా బాధితులకు అప్పగించడం జరుగుతుందన్నారు. ఎవరూ వాహనాలను తీసుకెళ్ళడానికి ముందుకు రాకపోతే 14 రోజుల తరువాత అంటే ఈనెల 30న వేలం వేస్తామన్నారు.

నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- వట్టెం రిజర్వాయర్ పనులను అడ్డుకున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులు
- తహసీల్దార్, ఎస్‌ఐల హామీతో నిరసన విరమణ


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి, హెచ్‌ఈఎస్ జీఎం సుబ్రమణ్యం

బిజినేపల్లి, ఆగస్టు 16 : పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న వట్టెం (వెంకటాద్రి) రిజర్వాయర్‌లో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని వట్టెం గ్రామ సమీపంలో రిజర్వాయర్ పనులు చేస్తున్న హెచ్ ఈఎస్ కంపెనీ ముందు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులు, భూములు కోల్పోయి పరిహారం అందని బాధితులు శుక్రవారం టెంట్ వేసి బైఠాయించి ప్రాజెక్టు పనులను ఆడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన ముడావత్ రామునాయక్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం అవసరమైన 4500 ఎకరాల భూమితో పాటు నివాస గృహాలను, దేవాలయాలను, తాత, ముత్తాతల సమాధులను సర్వం త్యాగం చేస్తే ప్రభుత్వం కానీ, సంబంధిత గుత్తేదారులు కానీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం కోసం ప్రభుత్వం 61.50 ఎకరాల భూమి కేటాయించింది. అందులో 466 నిర్వాసితులకు ఇళ్లు, పాఠశాల, గ్రామ పంచాయతీ, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ వంటి మౌలిక వసతుల కల్పనతో పాటు దేవాలయాల నిర్మాణం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ లైన్ పనులు, అండర్ డ్రైనేజీ, వాటర్ లైన్ పనులు చేపట్టినా ఇప్పటి వరకు ఆలయాల నిర్మాణానికి ఎలాంటి ఆర్థిక సాయం అందజేయలేదని అన్నారు. ఈనెల 29న కనీసం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసుకుందామని ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన భూమిలో దిమ్మె ఏర్పాటు చేస్తుంటే గతంలో భూమి యజమానులుగా ఉన్న వ్యక్తులు అడ్డుకుంటున్నారని తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు, ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డిలకు వివరించారు. అక్కడే ఉన్న హెచ్‌ఈఎస్ జీఎం సుబ్రమణ్యం సమాధానం చెబుతూ ఆలయ నిర్మాణానికి ఒప్పుకున్న ఆర్థిక సాయాన్ని వచ్చే నెలలో ఆలయ కమిటీ ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వారం రోజుల్లో భూసర్వే చేసి బౌండరీ ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్, ఎస్‌ఐలు నిర్వాసితులకు హామీ ఇవ్వడంతో తమ నిరసనను విరమించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో తిరుపతి నాయక్, పాండు నాయక్, రాములు నాయక్, దాసు, భగవంతు, బాల్‌రాం, మల్లయ్య తదితరులు ఉన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తులు చేసుకోండి

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 16 : హజ్ యాత్రకు జిల్లాకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మెహరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వక్ఫ్ కాంప్లెక్స్‌లో గల ఆ సంఘ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్లే వారు పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు, బ్యాంక్‌పాస్ బుక్, ఓటర్‌ఐడీ, వాటర్, గ్యాస్‌బిల్, విద్యార్హతలు, వృత్తి, బ్లడ్ గ్రూప్ తదితర ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. సొసైటీ తరఫున ఉచితంగా ఆన్‌లైన్ చేస్తామని, పూర్తి వివరాలకు సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


చనిపోయిన వ్యక్తి

మహబూబ్‌నగర్, ఆగస్టు 16 : నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని బైపాస్- వీస్తా హోటల్ చౌరస్తాలో శుక్రవారం ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళుతుండగా టిప్పర్ ఢీకొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. అతనికి సంబంధించిన వివరాలు తెలియలేదు. జరిగిన ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి


రాయి చెరువు సమీపంలో మృతి చెందిన చిరుత

మద్దూర్, ఆగస్టు 16 : అనుమానాస్పదస్థితిలో ఓ చిరుత మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం జాదవ రావుపల్లి గ్రామంలోని రాయం చెరువు సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గమనించిన గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తేనే చిరుత మృతికి గల కారణాలు తెలుస్తాయని ఫారెస్ట్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. అదే విధంగా మూడు నెలల క్రితం నందిపాడ్ శివారులోని మల్కి జాదరావుపల్లి గుట్ట శివారులో చిరుత అనుమానాస్పదంగా మృతి చెందగా, నందిగామ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన బోనుకు చిక్కింది.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి, ఆగస్టు 16 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని పెద్దూరులో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. పెద్దూరుకు చెందిన వినోద్‌కుమార్‌రెడ్డి తన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇతని పేరు మీద ప్లాట్ కొనివ్వడం జరిగింది. వినోద్ కుమార్‌రెడ్డి వికలాంగుడు. బుద్ధి మాంద్యం కలిగినవాడు. ఇది ఆసరాగా చేసుకుని అతని బంధువు ఒకరు బాండ్ పేపరుపై సంతకాలు చేయించుకుని తన పేరు మీదుగా రిజిస్టర్ చేయించుకున్నాడు. దాంతో మనస్తాపానికి గురై వినోద్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాంతో అతనిని కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. తన కుమారుడికి ఈ విధంగా జరగడానికి కారణమైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని తండ్రి కోరారు.

హెచ్‌సీఏ టోర్నీలో 54 పరుగులతో మహబూబ్‌నగర్ గెలుపు


గెలిచిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 16 : హెచ్ సీఏ అండర్-16 ఇంటర్ స్కూల్ కాలేజీస్ క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహ బూబ్‌నగర్ జట్టు 54 పరుగుల తేడా గెలిచింది. శుక్రవారం హైదరాబాద్ లోని ఘట్‌కేసర్ ఏఎంసీజీ మైదానంలో నాగార్జున హై స్కూల్, మహబూబ్‌నగర్ జట్లు తలబడ్డాయి. మొదట బ్యా టింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 30.2 ఓవర్లలో 98 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో ప్రణవ్‌కార్తికేయ 20, రామ్‌కుమార్‌చారి 14 పరుగులు చేశారు. అనంతరం బ్యా టింగ్‌కు దిగిన నాగర్జున హై స్కూల్ జట్టు 20.5 ఓవర్లలో 44 పరుగులకు కుప్పకూలింది. జట్టులో అరవింద్ 12 పరుగులు సాధించాడు. జిల్లా బౌలర్లలో అభినవ్ 3, కాన్షిక్‌గౌడ్ 3, మణిచరణ్ 2 తీసి జిల్లా జట్టు విజయానికి కృషి చేశారు. జిల్లా జట్టు విజయం సాధిం చడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

పెద్దమందడి, ఆగస్టు 16 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మోజర్ల ఉద్యానవన కళాశాల విద్యార్థులు వివిధ అథ్లెటిక్స్ విభాగాలకు ఎంపిక అయ్యారని కళా శాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. అండర్-23 బాలుర విభాగంలో షార్ట్‌పుట్ డిస్కస్ త్రోలో ప్రథమ స్థానంలో ఏ.అరుణ్‌కుమార్, అండ ర్-23 బాలికల విభాగం లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో జి.హరిక, పురుషుల విభాగం పరుగులో 1500 మీటర్స్‌లో ప్రథమ స్థానంలో పి.వంశీకృష్ణ నిలిచారని తెలిపారు. విజేతలకు మెదక్ జిల్లాలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటిలలో పాల్గొంటారని అలాగే రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకు, వనపర్తి జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీన్ సైదయ్య కోరారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌పీ డాక్టర్ రాజశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ పూర్ణిమ మిశ్రా, ఫిజికల్ డైరెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

సూగూరు అలుగు ధ్వంసం

- ఏటిపాలు అవుతున్న సాగునీరు


సూగూరు నల్లచెరువు అలుగును ధ్వంసం చేయడంతో ఏటి పాలవుతున్న సాగునీరు

పెబ్బేరురూరల్, ఆగస్టు 16 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని సూగూరు గ్రామ నల్ల చెరువు అలుగును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో చెరువులో ఉన్న రెండు అడుగులు నీరు ఏటిపాలు కావడంతో చెరువులో నీరు తగ్గిపోయింది. చెరువు బ్యాక్ వాటర్ వల్ల బున్యాదిపురం, జానంపేట గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు భూమిలో వరి నాట్లు వేయాలనే ఉద్దేశంతో ఈ అలుగును ధ్వంసం చేసి ఉంటారని సూగూరు గ్రామ ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇదే విధంగా అలుగును రెండు వైపులా ధ్వంసం చేశారని చెప్పారు. అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేయాలని , వారిని అరెస్టు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న బీమా ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీరు కిరణ్‌కుమార్ స్పందించి శనివారం లోగా ధ్వంసం చేసిన అలుగును తాత్కాలిక మరమ్మతులు చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

నవాబ్‌పేట,ఆగస్టు 16: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం తప్పించబోయి ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలో కాకర్లపాడ్ గేటు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని గాల్లోనికుంట తండాకు చెందిన సురేష్, గణేష్, విశాల్ అనే ముగ్గురు యువకులు శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో సొంత పనుల నిమిత్తం నవాబ్‌పేట నుంచి జిల్లా కేంద్రం వైపు వెళ్తుండగా కాకర్లపాడ్ గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు శంకరయ్య వాహనం తప్పించబోయి అందరు కిందపడ్డారు దీంతో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అందరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పై తమకు ఎలాంటి పిర్యాదు అందలేదని ఎస్‌ఐ విక్రం తెలిపారు.

వివాహిత అదృశ్యం : కేసు నమోదు

మిడ్జిల్, ఆగస్టు 16 : మండలంలోని భైరంపల్లి గ్రామానికి చెందిన బోడ జ్యోతి శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదని జ్యోతి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్తున్న చెప్పి వెళ్లిందని తిరిగి రాకపోవడంతో తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. జ్యోతి అచూకి తెలిసిన వారు వెంటనే మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

ఆటో కంటైనర్ ఘటనలో మరొకరు మృతి

- చికిత్స పొందుతూ యువతి మృతి - ఇ.తాండ్రపాడులో విషాదం
- మృత్యువుతో పోరాడుతున్న అనిత


ప్రియాంక (ఫైల్)

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 16 : కూలీలు 17 మందితో వెళ్తున్న ఆటోను కంటైనర్ ఢీకొన్న ఘటనలో మరొకరు మృత్యువాత పడినట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గురువారం ఉండవల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మినహా డ్రైవర్‌తో సహా 17 మంది గాయపడ్డారు. ఘటనా స్థలంలో లక్ష్మీదేవి చికిత్స పొందుతుండగా రమాదేవి మృతి చెందింది. మృత్యువుతో పోరాడుతూ మరో కూలీ ప్రియాంక (19) శుక్రవారం మృతి చెందింది. మద్దిలేటి, నాగలక్ష్మిలకు ఉన్న ముగ్గురు కూతుళ్లలో ప్రియాంక రెండవ సంతానం. ఆమె ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇంటర్ మధ్యలోనే ఆపేసి కుటుంబం కోసం కూలీ పనులకు వెళ్తూ ఇలా మృత్యుఒడిలోకి వెళ్లిపోయింది. ఇక డ్రైవర్ నరసింహులు జనరల్ వార్డులో చికిత్స పొందుతుండగా అనిత మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఘటనతో కర్నూలు జిల్లా ఇ.తాండ్రపాడు గ్రామంలో విషాదం నెలకొంది. రోజువారీగా గ్రామం నుంచి ఉండవల్లి మండలంలోని కంచుపాడు గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల కూలీ పనులకు వస్తుండగా ఈ ఘటన జరిగింది.

విద్యుదాఘాతంతో గేదె మృతి


అంకిరోనిపల్లిలో మృతిచెందిన గేదె

అచ్చంపేటటౌన్, ఆగస్టు 16 : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని అంకిరోనిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముడావత్ పరమేష్‌కు చెందిన గేదెలు తన పొలం మేపేందుకు వెళ్లగా గేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు దగ్గరకు వెళ్లడంతో షాక్‌కు గురైంది. అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. గేదె ధర దాదాపు రూ. 60వేలు ఉంటుందని తెలిపారు.

కోనాపూర్‌లో...

వంగూరు: మండలంలోని కోనాపూర్‌లో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందింది. వ్యసాయ పొలంలో ఉన్న ఆవు మేత మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అర్తువైర్‌కు విద్యుత్ సరఫర కావడంతో ఆ వైర్‌కు తగిలి ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు నూకం శంకరయ్య తెలిపాడు. మృతి చెందిన ఆవు విలువ రూ. 80వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని శంకరయ్య కోరుతున్నాడు.

అధ్యాత్మిక భావనతో కలిసిమెలిసి జీవించాలి

ఆత్మకూరు, ఆగస్టు 16: ఆధ్యాత్మిక భావనతో కలిసి మెలిసి జీవిస్తేనే గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొనే అవకాశం ఉందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిన్నంచర్ల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీనివాస్ గుప్త దంపతులు , చంద్రశేఖర్ రెడ్డి దంపతులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 50 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. నిర్మాణంలో గ్రామస్థులు కూడా భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు.



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కార్యక్రమంలో తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మశ్చందర్ గౌడ్, బంగారు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు నల్గొండ శ్రీనివాసులు, తులసిరాజ్, రహమతుల్లా, ఖాజన్న, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వరాలమ్మ, తాజ్ పాషా, నాలుగు నెలల బాలుడు మృతి చెందడం బాధాకరం అని మక్తల్ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను శుక్రవారం ఓదార్చి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నాయకులు నాగరాజు గౌడ్, రహమతుల్లా, వెంకటన్న, యువకులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వైద్యులు

వనపర్తి వైద్య విభాగం, ఆగస్టు 16: ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకే ప్రాణ రక్షణ లేకుండా అవుతుందని ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకొచ్చి వైద్యులకు రక్షణ కల్పించాలని సీనియర్ ప్రెసిడెంట్ డాక్టర్ మనిషా కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి రాజీవ్ చౌరస్తాకు సీనియర్ ప్రెసిడెంట్ వైద్యులు, వైద్య విద్యార్థులతో కలిసిన నిరసన ర్యాలీ చేశారు. రాజీవ్ చౌరస్తాకు చేరుకుని కోల్‌కతా ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే వైద్యులకే ప్రాణ రక్షణ లేకుంటే స్వేచ్ఛగా వైద్యం ఎలా చేయగలమని భయాందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సక్రు నాయక్, డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ వెంకట్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ కాలువ పరిశీలన

అమరచింత, ఆగస్టు 16: అమరచింత శివారులోని భూత్పూర్ రిజర్వాయర్ కాలువలను నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. భూత్పూర్ కెనాల్ నుంచి అమరచింత చెరువును నీటితో నింపడానికి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు ఏఈ మోహన్ కుమార్, డీఈ సతీష్ కుమార్, రైతులు, నాయకులు వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

వీపనగండ్ల, ఆగస్టు 16: మండల పరిధిలోని గోవర్ధనగిరిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు మహబూబ్ పాషా అన్నారు. శుక్రవారం గ్రామంలో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారాయని, అధికారులు స్పందించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి ఖాజా హుస్సేన్, రవిప్రసాద్, శ్రీనివాసులు, మహమ్మద్, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

కోదండరామ్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా

వనపర్తి టౌన్, ఆగస్టు16: ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ కోటాలో మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎ ఖాదర్ పాషా కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో కోదండరామ్ ఎమ్మెల్సీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, మండ్ల దేవన్న నాయుడు, చుక్క రాజు, బాలేమియా, రఘు నాయుడు, బాలకృష్ణ, రాజేష్ కుమార్ శెట్టి, ఎండి షఫీ, మైనార్టీ నాయకులు నసీర్, షాకీర్ బాషా, చాంద్‌పాషా, కొత్తకోట కౌన్సిలర్ ఖాజా మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : సీపీఐ

వీపనగండ్ల, ఆగస్టు 16: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొల్లారంలో గ్రామ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటం చేశారని, వాటి ఫలితాలు వస్తున్నాయన్నారు. గోపాల్‌దిన్నె, సింగోటం రిజర్వాయర్ల అనుసంధాన కాలువల్లో భూములు కోల్పోయిన రైతులకు సీపీఐ పోరాట ఫలితంగా రూ. ఆరు లక్షల నలభై ఒక్క వేలు ఇచ్చేందుకు ప్రతిపాదనకు పోతున్నాయన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. నిరంతరం ప్రజల కోసం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీని బలోపేం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వంక గోపాల్, కుర్మయ్య, చల్లారెడ్డి, వినోద్‌స్వామి, శివకుమార్, అమీద్, చాంద్‌పాష, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన వైద్యాధికారులు

అమరచింత, ఆగస్టు16 : మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న కేజీబీవీ పాఠశాలను శుక్రవారం తిప్పడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న గదులను, బాత్రూమ్‌లను పరిశీలించి దోమల నివారణ మందును పిచికారి చేశారు. వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే మలేరియా, చికున్ గున్యా, డెంగీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేష్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ కేశవులు, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్ గౌడ్, కేజీబీవీ ఎస్‌వో స్వప్న రాణి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

'పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి'

వనపర్తి టౌన్,ఆగస్టు16: పట్టణంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లను నిర్మించి ఇవ్వాలని , పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ పట్టణ నిర్మాణ కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశం గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షులు జయమ్మ, శిరీష, ఎర్రకుర్మయ్య, లక్ష్మీ నారాయణ, చిన్న కురుమన్న, ఎత్తం మహేష్, ఎత్తం విష్ణు, చంద్రశేఖర్, చిన్న వెంకటేష్, శాంతన్న, తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో బంద్ విజయవంతం

- నిలిచిన వాహనాల రాకపోకలు - మూతపడిన దుకాణాలు

అమరచింత, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ శుక్రవారం హిందూ ఐక్యవేదిక , బజరంగ్ దళ్ , బీజేపీ పిలుపు మేరకు చేపట్టిన అమరచింత బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక, బీజేపీ నాయకులు ఉదయం నుంచి ప్రధాన రహదారుల గుండా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాపార సముదాయాలు, ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలు, పెట్రోల్ బంక్‌లు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మేర్వ రాజు, పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, నాయకులు రాకేష్ శెట్టి, సిద్ద రాములు, వాటర్ శ్రీను, విజయ యాదవ్, మేర్వ అనిల్, క్యామ భరత్, గోవర్ధన్, భీమ్‌సేన్, నరసింహ, అనిల్ , నాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు16: శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా కేంద్రంలో వరలక్ష్మీ వ్రత పూజలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సాయినగర్ రామాలయాలలో వరలక్ష్మీ వ్రత వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించి సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు చేశారు. సాయంత్రం 7 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అయ్యలూరి రఘునాథాచార్యులు తెలిపారు. సాయినగర్ కాలనీ రామాలయంలో వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో హాజరై పూజలు చేసి వ్రతాలు నిర్వహించారు.

పెబ్బేరు: మండల కేంద్రంలోని శిరిడిసాయి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక వ్రతాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కొత్తకోట: మండలంలోని దేవాలయాలు శ్రావణమాస రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలను పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని భవాని శంకర ఆలయంతో పాటు కోదండరామస్వామి, భక్త మార్కండేయస్వామి, రాఘవేంద్రస్వామి, సంకల్ప సిద్ధి సాయినాథ, కన్యకా పరమేశ్వరి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. సరస్వతీ శిశుమందిర్‌లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాల పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయాల నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



వనపర్తిలోని రామాలయంలో అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారి, పాల్గొన్న మహిళలు

అమరచింత: పట్టణంలోని అలివేలు మంగ సమేత లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో మహిళలు జరుపుకున్నారు. సామూహిక మంగళహారతి ఇచ్చి పూజలు జరిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పబ్బతి వెంకటస్వామి, ఒగ్గు రామలింగం, గాజుల వెంకటేష్, తిరుమలేష్, శివ, కళావతి, సంధ్య, పల్లవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణ కేంద్రంలోని అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి దేవస్థానంలో రెండవ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం మహిళలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ మహిళలు భక్తులు పాల్గొన్నారు.



అమరచింత వేంకటేశ్వర స్వామి ఆలయంలో హారతి ఇస్తున్న మహిళలు



ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

- ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలన

వనపర్తి వైద్య విభాగం, ఆగస్టు16: డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి మునిసిపాలిటీలోని బ్రహ్మంగారి వీధిలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి చుట్టు పక్కాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న నీటిలో డెంగీ కారకమయ్యే దోమలు గుడ్లు పెడతాయని, అందువల్ల ఎక్కడ నిలువ నీరు, వర్షపు నీరు ఉండకుండా పారవేయాలని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పట్టణంలోని ఒకటవ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రెండవ వార్డు కౌన్సిలర్ రమాదేవి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ ఆధ్వర్యంలో 32వ వార్డు కౌన్సిలర్ పెండెం నాగన్న ఆధ్వర్యంలో వార్డులలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించా రు. కార్యక్రమంలో వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మునిసిపల్ కమి షనర్ పూర్ణ చందర్, కౌన్సిలర్ బ్రహ్మచారి, ఆర్‌ఐ అనిల్ కుమార్, శివకుమార్, ఆర్‌పీలు అనిత, నం దిమల్ల రాధిక , లక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



జయన్న తిరుమలాపూర్ గ్రామస్థురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. కొంతమంది ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని తనకు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇక నుంచి ఉదయం 9 గంటల వరకు పాఠశాలలకు హాజరు కావాలని ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ హాల్లో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతీ ఉపాధ్యాయుడు తన సెల్‌ఫోన్‌లో జీపీఎస్ కెమెరా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పాఠశాలకు చేరుకున్న వెంటనే సెల్ఫీ ఫొటో తీసుకుని సంబంధిత క్లస్టర్ హెడ్మాస్టర్‌కు పంపించాల్సి ఉంటుందన్నారు. మండల విద్యాధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్ల హాజరును జిల్లా విద్యాధికారి పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల నమోదు శాతంతో పాటు పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతశాతం గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండవ జత ఏక రూప దుస్తులు విద్యార్థులకు తక్షణమే అందేలా చూడాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఖచ్చితంగా ఆంగ్లమాధ్య మంలో బోధించాలని సూచించారు. ఇచ్చిన సూచనలు శనివారం నుంచి అమలు జరగాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, ఎంఈవోలు, క్లస్టర్ హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి

గోపాల్‌పేట: విషజ్వరాలు ప్రబలుతున్న ప్రాంతాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని జయన్న తిరుమలాపూర్ గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. గ్రా మంలో గత నెల డెంగీ వ్యాధి బారిన పడిన వారి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఫీవర్ సర్వే నిర్వహించి అనుమానితుల రక్తనమూనాలు సేకరించి వ్యాధి లక్షణాలు కనుక్కోవాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్‌ను, నిల్వ సామగ్రిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీబాయి, వైద్య శాఖ ప్రోగాం అధికారి సాయినాథ్ రెడ్డి, తహసీల్దార్ తిలక్‌కుమార్ రెడ్డి, ఎంపీడీవో శంకర్‌నాయక్, కమిషనర్ పూర్ణచందర్, కౌన్సిలర్ బ్రహ్మచారి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా వైద్యశాఖ అధికారి జయచంద్రమోహన్

పెబ్బేరు, ఆగసు16: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి జయచంద్రమోహన్ సూచించారు. శుక్రవారం పెబ్బేరు మునిసిపాలిటీ కేంద్రంలో రెండో వార్డులో ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే గురించి పట్టణ ప్రజలకు వివరించారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, మునిసిపల్ కమిషనర్ ఆదిశేషు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, యోగేష్, ఏఎన్ఎం లావణ్య, వెంకట నర్సమ్మ, ఆశ కార్యకర్తలు, మునిసిపల్ సిబ్బంది, బ్రీడింగ్ చెక్కర్స్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పెబ్బేరులో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్

పరిశుభ్రతను పాటిద్దాం

పాన్‌గల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు శాఖాపూర్, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, డాక్టర్ తారా శశాంక్, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, మదన్‌గోపాల్, ఏఎన్ఎంలు నర్సమ్మ, సుమిత్ర, సరళా, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులను తరిమికొడదాం

వనపర్తి రూరల్: ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులు సంక్రమించకుండా తరిమి కొట్టాలని ఎంపీడీవో రాఘవ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా పెద్దగూడెం గ్రామంలో సందర్శించారు. వీధుల గుండా తిరిగి గ్రామ పంచాయతీ కార్మికులచే డ్రైనేజీలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, క్షేత్ర సహాయకులు పాషా, అంగన్‌వాడీ టీచర్లు ఉమా, లావణ్య, అరుణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరం

ఆత్మకూరు: పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తేనే సీజనల్ వ్యాధులు దరిచేరవని మునిసిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. డ్రై డే ఫ్రైడే లో భాగంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మూడవ వార్డులో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ అశ్విని కుమార్‌తో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భూపాల్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ పేర్కొన్నారు. 10వ వార్డులో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని వైస్ చైర్మన్ జీఎస్ గోపి , కమిషనర్ నూరుల్ నజీబ్‌లతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సురేందర్ గౌడ్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, పట్టణ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

పెబ్బేరు, ఆగస్టు 16: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మహిళల ఉచిత బస్ ప్రయాణం పట్ల కించపరుస్తూ బస్సులలో బ్రేక్ డా న్సులు, రికార్డింగ్ డాన్స్‌లు చేయండని వ్యంగంగా మాట్లాడటం సరికాదని పెబ్బేరు మాజీ సర్పంచు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అక్కి సుశీల అన్నారు. శుక్రవారం పెబ్బేరు మండల కేంద్రంలోని సు భాష్ చౌరస్తాలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు అక్కి సుశీల ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు ప్రయాణాలపై అనుచిత వ్యాఖ్యలను చేసిన కేటీఆర్‌పై చర్య లు తీసుకొని మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రాద్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, గంధం రాజశేఖర్, కౌన్సిలర్ అక్కమ్మ, తోమాలపల్లి మాజీ సర్పంచు సురేందర్‌గౌడ్, బుర్రమోని రాము లుయాదవ్, భాను ప్రకాష్‌రెడ్డి, సత్యనారాయణ, షకీల్, దయాకర్‌రెడ్డి, శివసాయి, దాబా సత్యనారా యణరెడ్డి, నరసింహనాయుడు పాల్గొన్నారు.



పెబ్బేరులో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వనపర్తిలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోటలో ..

కొత్తకోట : మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పా లని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కా ర్య క్రమంలో ఆ పార్టీ పట్ట ణ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వనపర్తి కృష్ణారెడ్డి, సాయులుయాదవ్, జేసీబీరాము, సలీం ఖాన్, బాలకృష్ణ, గఫార్, వెంకటేష్, రాములు యాదవ్, అంజన్న యాదవ్, శ్యాం, బాలరాజు, మహేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్, దిలీప్‌రెడ్డి, ఖలీల్, కార్తీక్‌గౌడ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వనపర్తి పట్టణంలో..

వనపర్తి టౌన్: మహిళల పట్ల సభ్యత సంస్కారం లేని వ్యక్తి కేటీఆర్ అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కేటీఆర్ మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు బాప నపల్లి వెంకటేష్, చీర్ల సత్యం సాగర్, విభూతి నారాయణ, రవి యాదవ్, యాదగిరి, మధు గౌడ్, శ్యామ్, వినోద్, సతీష్, కృష్ణబాబు, ద్యారపోగు వెంకటేష్, బొంబాయి మన్యంకొండ, లతీఫ్, చుక్క రాజు, నరేం దర్, కొమ్ము గౌతం, ఎల్లప్ప కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

పాన్‌గల్, ఆగస్టు16: మండల పరిధిలోని అన్నారం తండా ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో గోవింద రావు ప్రార్థన సమయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రార్థన చేయించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థుల నమోదు ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిచ్యానాయక్, ఉపాధ్యాయురాలు చెన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బొజ్యా తదితరులున్నారు.

ఉమ్రా యాత్రికుడికి ఘన సన్మానం

అమరచింత, ఆగస్టు 16: పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్తున్న అమరచింతకు చెందిన సయ్యద్ సిరాజ్ దంపతులను శుక్రవారం పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఏబీ నిస్సార్ , ఖాజా హుస్సేన్, ఫరీద్, నబీ, అన్సర్, టైలర్ బాబు, ఇస్మాయిల్, మహమ్మద్ కౌసర్, రాజేందర్ గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ



బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఆగస్టు16: మండలంలోని ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాములు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి కార్యకర్తను పరామర్శించారు. అనారోగ్యానికి గురైన కార్యకర్త రాములు త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని మామిడిమాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రవీందర్ గౌడ్ నూతన గృహ ప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాలీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

ఖిల్లాఘణపురం, ఆగస్టు16: మండలంలోని ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం రెండో విడత యూనిఫామ్స్ దుస్తువులను శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కాళిదాసు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఎంఆర్‌సి సిబ్బంది తిరుపతయ్య, పవన్, రజిత, అర్జున్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న లక్కాకుల సతీష్

కొత్తకోట, ఆగస్టు 16 : మండలంలోని కానాయపల్లి గ్రామ సమీపంలో గల కోటిలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వనపర్తి పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కాకుల సతీష్ అయిదు లక్షల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వనపర్తి నియోజక వర్గం నుండి మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలువాలన్న కోరిక నేరవేరడంతో కోటిలింగేశ్వరస్వామికి భారీ విరాళాన్ని అందజేస్తానని సతీష్ తెలిపారు. అంతకుముందు ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖరయ్య సతీష్‌కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

పాలకుల నిర్లక్ష్యమే కారణం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్

వనపర్తి అర్బన్, ఆగస్టు 16: తలాపునే కృష్ణమ్మ పారుతున్నా అధికారంలో ఉన్న పాలకుల నిర్లక్ష్యం వల్ల వనపర్తి పట్టణం, మండలంలోని చెరువులు నింప లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం రైతులతో కలిసి వనపర్తి పట్టణ, మండల పరిధిలోని చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా ఏలూరు నుంచి గుడిపల్లి మెయిన్ కెనాల్ నుండి ఎంజె మూడు కాలువ ద్వారా వనపర్తి పట్టణ చుట్టు ఉన్న చెరువులతో పాటు మండల చెరువులు నింపే అవకాశం ఉం దన్నారు. వర్షాకాలంలో కూడా చెరువులు, భూములు బీడుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నారు మడులు పోసి సాగు చేయాల్సిన రైతాంగం చెరువులలో నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మండిపడ్డారు. వారికి నష్టప రిహారం కట్టించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు వెం టనే స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చీఫ్ ఇంజనీర్ ఇరిగేషన్ ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా వెంటనే రైతు భరోసా కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేష్ గౌడ్, కౌన్సిలర్లు కంచె రవి, నాగన్న యాదవ్, మాజీ కౌన్సిలర్ తిరుమల్ పాల్గొన్నారు.